క్లుప్తంగా

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న సీఐ ప్రవీణ్‌కుమార్

పెద్దపల్లిరూరల్: రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని సీఐ ప్రవీణ్‌కుమార్ సూచించారు. పెద్దపల్లి మండలం రాఘవాపూర్ ఎస్సీ కాలనీలో శుక్రవారం బసంత్‌నగర్ ఎస్సై స్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు యత్నించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో అవసరమై వీధులను గుర్తించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని నేరాల నియంత్రణకు సహకరించాలని కోరారు.

అభివృద్ధిపై సమీక్ష సమావేశం

ఎలిగేడు: మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో భాస్కర్‌రావు అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులతో అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ యువ వికాసం, పెన్షన్ల వివరాలు, ఇంటిపన్నులు 2025–26 డిమాండ్‌ను సిద్ధం చేసుకోవడం, ఉపాధిహామీ పనులు, నర్సరీల నిర్వహణపై చర్చించారు. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని, గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సమావేశంలో చర్చించి, సలహాలు, సూచనలు చేశారు. ఎంపీవో కిరణ్, పీఆర్ ఏఈ, కార్యదర్శులు పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకు సమ్మె నోటీసు

ఎలిగేడు: అపరిష్కృతంగా ఉన్న సమస్యలతోపాటు, తమ డిమాండ్ల సాధనకోసం గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 19 తర్వాత ఏరోజు నుంచి అయినా నిరవధిక సమ్మె చేపడతామని శుక్రవారం ఎంపీవో కిరణ్‌కు సమ్మె నోటీసు అందజేశారు. వారు మాట్లాడుతూ తమకు బకాయి వేతనాలు చెల్లించాలని కోరారు. మల్టీపర్పస్ వర్కర్స్ విధానం రద్దు చేయాలని, కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని, అర్హులైన వారికి ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. జీపీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు తీట్ల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు ఇరుగురాల లచ్చయ్య, కె.దేవేందర్, జి.మల్లేశం, ఇ.శ్రీనివాస్, ఇ.నర్సయ్య, కె.నర్సయ్య, చంద్రయ్య, స్వామి, మల్లయ్య, చిరంజీవి ఉన్నారు.

వైభవంగా కుంకుమ పూజలు



కాల్వశ్రీరాంపూర్: శ్రీరామనవమి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కాల్వశ్రీరాంపూర్ సీతారామ చంద్రస్వామి ఆలయంలో శుక్రవారం మహిళలు కుంకుమ పూజలు చేశారు. అర్చకులు దత్తాత్రేయ శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోటలో గత నెల మార్చి 27న పూరెల్ల సాయికుమార్‌ను హత్య చేసిన నిందితులను, హత్యకు ప్రధాన సూత్రధారులైన నిందితులను కఠినంగా శిక్షించాలని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.చక్రవర్తి, సావిత్రిబాయిపూలే మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షులు గన్నారపు సరోజన కోరారు. ముప్పిరితోటలోని మృతుడు సాయికుమార్ కుటుంబాన్ని శుక్రవారం కుల అసమానత నిర్మూలన పోరాట సమితి, సావిత్రిమాయిపూలే మహిళా సంఘం, నిజనిర్ధారణ కమిటీ పరామర్శించారు. ఆయా సంఘాల నిజనిర్ధారణ కమిటీ బృందం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చైతన్య భారతి, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈరపాగ గోవిందు, రాష్ట్ర నాయకులు ఎర్ర మోహనకృష్ణ, ఆరెల్లి క్రాంతికిరణ్, రాష్ట్ర కన్వీనర్ తెలంగాణ సామాజిక ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం సభ్యులు వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రామ సమస్యలు పరిష్కరించాలి

ఫెర్టిలైజర్‌సిటీ: పాలకుర్తి మండలం ఎఫ్‌సీఐ ఎల్కలపల్లి గేట్ గ్రామపంచాయతీని కార్పొరేషన్‌లో విలీనం చేయడంతో కొన్నేళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదు. ఎఫ్‌సీఐ ఎల్కలపల్లిగేట్ గ్రామాన్ని గ్రామపంచాయతీగానే కొనసాగించాలని కలెక్టర్ కోయ శ్రీహర్షకు శుక్రవారం గ్రామస్తులు వినతిపత్రం అందించారు. కార్పొరేషన్‌లో విలీనం చేస్తే గ్రామంలోని ప్రజలు నష్టపోతారని తెలిపారు. దెబ్బెట భానుచందర్, బండి సాయికుమార్, చరణ్ ఉన్నారు.

వరిలో తాలుగొలుసు

- మొగిపురుగు ఆశించడంతో దిగుబడి తగ్గుతుందన్న ఆందోళనలో రైతన్న
- సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి: వ్యవసాయ అధికారులు

జూలపల్లి: యాసంగి వరిపంట చివరి దశకు చేరింది. మరో 10 రోజుల్లో ఎస్సారెస్పీ, బావులు, బోర్ల కింద సాగు చేసిన పొలాలు కోత దశకు చేరుతాయి. పెద్దాపూర్ పెద్ద చెరువుతో పాటు, చిన్న నీటి పారుదల కుంటల కింద కొంత ఆలస్యంగా నాట్లు వేయడంతో ఇప్పుడిప్పుడే వరి కంకులు బయటకు వస్తున్నాయి. ఆలస్యంగా వేసిన వరిలో చిరు పొట్టదశలో మొగిపురుగు ఆశించి వరిగొలుసు తాలుగా మారుతున్నాయి. దీంతో దిగుబడి తగ్గే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే రైతులు చిరు పొట్టదశలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. మండల కేంద్రంతో పాటు 12 గ్రామాల్లో ఈ యాసంగిలో ఎక్కువ విస్తీర్ణంలో వరి సాగు చేశారు.


పెద్దాపూర్ గ్రామంలో ఓ రైతు పొలంలో తాలుగా మారిన వరిగొలుసు

సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి



వరిపంట ఆలస్యంగా సాగు చేసిన రైతులు చిరు పొట్టదశలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి. మొగిపురుగు ఆశిస్తే వరిగొలుసు తాలుగా మారే అవకాశం ఉంటుంది. ఇందుకు రైతులు కాటాప్ హైడ్రోక్లోరైడ్, లేదా క్లోరాంట్రినిలిపోల్, ఫ్లూబెండమైడ్, పురుగు మందు పిచికారీ చేసుకోవాలి. దీంతో వరిలో తాలు కంకులు రాకుండా అరికట్టవచ్చు.

– ప్రత్యూష, ఏవో, జూలపల్లి

మా గ్రామాన్ని పంచాయతీలోనే కొనసాగించండి


వినతిపత్రం ఇస్తున్న వెంకట్రావుపల్లి వాసులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ప్రభావిత గ్రామమైన రామగిరి మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామాన్ని పంచాయతీలోనే కొనసాగించాలని గ్రామస్తులు కోరారు. సాక్షి దినపత్రికలో గురువారం ప్రచురితమైన 'ఏడేళ్లుగా ప్రజాపాలనకు దూరం' కథనానికి కదిలిన గ్రామస్తులు శుక్రవారం నాయకులతో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ అరుణశ్రీని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్పొరేషన్‌లో విలీనం చేయడం ద్వారా గ్రామంలో నివాసం ఉంటున్న దాదాపు 370 నిరుపేద కుటుంబాలు రోడ్డున పడుతాయని వాపోయారు. ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. మండలానికి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాన్ని కార్పొరేషన్లో కలపడంతో 25కిలోమీటర్ల దూరం పెరుగుతుందన్నారు. వెంకట్రావుపల్లి గ్రామాన్ని గ్రామ పంచాయతీలోనే కొసాగించి ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని విన్నవించారు. నాయకులు బుర్ర ముత్యాలగౌడ్, లక్ష్మణ్, ఎల్లయ్య, సతీశ్, గ్రామస్తులు ఉన్నారు.

సీతారాముల కల్యాణ మండపం ప్రారంభం


హోమంలో ఆలయ కమిటీ సభ్యులు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ లక్ష్మీపురం అభయాంజనేయ స్వామి ఆలయంలో సుమారు రూ.12లక్షలతో నూతనంగా నిర్మించిన శ్రీసీతారాముల కల్యాణ మండపాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు గణపతి హోమం నిర్వహించారు. కల్యాణ మండప నిర్మాణానికి సహకరించిన దాతలను సన్మానించారు. ఆలయ అధ్యక్షుడు సంధినేని వెంగళరావు, కోశాధికారి తాటికొండ రాజబాబు, కమిటీ సభ్యులు సబ్బాని శ్రీనివాస్, సంధినేని గోపాలరావు, వేముల రాజయ్య, తక్కలపల్లి సంతోష్, అట్ల శ్రీనివాస్, కాంపెల్లి శ్రీనివాస్, అటుకాపురం మల్లేశ్, బొడ్డుపల్లి నాగేష్, బొడ్డుపల్లి నాగరాజు పాల్గొన్నారు.

స్ఫూర్తి మానసిక దివ్యాంగ పాఠశాలకు తోడ్పాటు


ఆర్థికసాయం అందిస్తున్న ఎస్ఈ మాధవరావు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని బండారికుంటలో గల స్ఫూర్తి మానసిక దివ్యాంగ పాఠశాల నిర్వహణకు తమ వంతుగా ప్రతీనెల రూ.20వేల నగదు ట్రాన్స్ ఉద్యోగ సిబ్బంది, అధికారుల వేతనం నుంచి అందిస్తున్నామని ఎస్ఈ కంకటి మాధవరావు తెలిపారు. మానసిక దివ్యాంగ విద్యార్థుల పాఠశాల నిర్వహణకు తమవంతు సామాజిక బాధ్యతగా చేయూతనందించాలని సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. నాలుగు నెలలుగా తమ వేతనం నుంచి నేరుగా స్ఫూర్తి దివ్యాంగ పాఠశాల ఖాతాకు సొమ్ము జమ చేస్తున్నట్లు చెప్పారు. కార్యాలయ అధికారులు, ఉద్యోగులు ఉన్నారు.

నేడు అభివృద్ధి పనులు ప్రారంభం

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు సన్నబియ్యం పంపిణీ ప్రారంభోత్సవం, అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ తెలిపారు. కాల్వశ్రీరాంపూర్‌లో ఏర్పాటు చసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని మడిపెల్లికాలనీ, పెగడపల్లి, గంగారం, కాల్వశ్రీరాంపూర్, తారుపల్లి, మీర్జంపేట, కిష్టంపేట, మొట్లపల్లి, చిన్నరాతుపల్లి, పెద్ద రాతుపల్లి, ఇదులాపూర్ గ్రామాల్లో ఎమ్మెల్యే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, నాయకులు సతీశ్, శివరామకృష్ణ, రాజమల్లు, దేవేందర్ పాల్గొన్నారు.

లక్ష్యం కోసం కష్టపడాలి


నృత్యం చేస్తున్న విద్యార్థులు

సుల్తానాబాద్: ప్రతీ విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకొని ఇష్టంతో కష్టపడాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి.నరేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని అల్ఫోర్స్ పాఠశాల ఆధ్వర్యంలో యశోద నరహరి ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జోష్ పేరిట పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. విద్యార్థుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

గోదావరిఖనిటౌన్: ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఎదుట నూతనంగా నిర్మించిన రేణుకా ఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపనను బ్రహ్మశ్రీ దుద్దిళ్ల మనోహర అవధాని ఘనంగా నిర్వహించారు. రేణుకా ఎల్లమ్మ ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ, గీత పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న ఉత్సవ విగ్రహాల శోభాయాత్ర, శాంతి హోమం, దేవతామూర్తి విగ్రప్రష్ఠాపనతో కార్యక్రమం ముగిసింది. కార్యక్రమం ప్రారంభం నుంచి శుక్రవారం వరకు ఎర్ర కొమురయ్యగౌడ్ 4వేల మందికి అన్నప్రసాద వితరణ చేసినట్లు సంఘం నాయకులు తెలిపారు. సంఘం నాయకులు హన్మంత్ గౌడ్, యాదగిరిగౌడ్, స్వామి గౌడ్, రవిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సురేందర్, రవి, శ్రీధర్‌గౌడ్, రవి, సురేశ్, భీమయ్య, రామ్మూర్తి, అశోక్, నాగభూషణం, దామోదర్, రమేశ్, రాముగౌడ్ పాల్గొన్నారు.

శ్రీభక్తాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం


పూజలు చేస్తున్న అర్చకులు

రామగుండం: పట్టణంలోని శ్రీభక్తాంజనేయస్వామి ఆలయ వార్షిక వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, పుణ్యాహవచనం, అఖండ కలశస్థాపన, బలిప్రదానం, పూర్ణాహుతి తదితర పూజలు చేశారు. వేడుకలకు హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రావు, శివప్రసాద్, రాములుగౌడ్, ఆత్మలింగం, వెంకటరమణ, వైకుంఠం, అంజయ్య ఉన్నారు.

అంతర్జాతీయ సహకార దినోత్సవం ర్యాలీ

ఎలిగేడు: అంతర్జాతీయ సహకార సంవత్సరం -2025 అవగాహన ర్యాలీని శుక్రవారం ఎలిగేడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సహకార సంఘం నుంచి ఎలిగేడు బస్టాండు వద్ద అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. సింగిల్‌విండో చైర్మన్ గోపు విజయభాస్కర్ రెడ్డి, డీసీవో శ్రీమాల, మానిటరింగ్ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు, సీఈవో కౌట్టి విక్రమ్, డైరెక్టర్లు, సంఘం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• ఈఎస్ఐ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందించాలి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండంలోని ఈఎస్ఐ ఆస్పత్రిలో కార్మికులకు, కార్మిక కుటుంబాలకు మెరుగైన వైద్యం అందించాలని సీఐటీయూ అనుబంధ రామగుండం ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి గీట్ల లక్ష్మారెడ్డి, నాంసాని శంకర్ డిమాండ్ చేశారు. టీటీఎస్‌లోని ఆస్పత్రిని సీఐటీయూ బృందం సభ్యులు శుక్రవారం సందర్శించారు. వారు మాట్లాడుతూ ల్యాబ్‌లో వ్యాధి నిర్ధారణకు ఉపయోగించే కిట్స్ లేవని, ఫార్మసీలో మందులు లేవన్నారు. నాయకులు రామాచారి, రాఘవరెడ్డి, రవీందర్, నాగభూషణం, దేవేందర్, లక్ష్మణమూర్తి, కుమార్ ఉన్నారు.

• కోదండ రామాలయం ఉత్సవ కమిటీ చైర్మన్‌గా గట్ల రమేశ్

గోదావరిఖనిటౌన్: స్థానిక శ్రీకోదండ రామాలయం ఉత్సవ కమిటీ చైర్మన్‌గా గట్ల రమేశ్ నియమితులయ్యారు. కమిటీ సభ్యులుగా వొజ్జల వెంకటేశ్వర్లు, ఎం.కృష్ణప్రియ, ఎస్.సత్తయ్య, ఎ.దశరథం, ఎం.ప్రవీణ్, ఇ.వనజారాణి నియమితులయ్యారు. వీరికి ఎండోమెంట్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ నాయిని సుప్రియ నియామక పత్రాలు అందజేశారు.

• విశ్వభారతిలో గ్రాడ్యుయేషన్ డే

జ్యోతినగర్: పిల్లలకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు రెండు కళ్లలాంటి వారని ఎన్టీపీసీ ఎస్సై టి.ఉదయ్‌కిరణ్ అన్నారు. ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలోని విశ్వభారతి హైస్కూల్‌లో శుక్రవారం యూకేజీ పూర్తి చేసుకున్న 115 మంది విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు పట్టాలు అందించారు. విద్యాసంస్థల చైర్మన్ బందారపు యాదగిరిగౌడ్, హెచ్‌ఎం తిరుపతిగౌడ్, ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

• సీతారామ హన్మాన్ ఉత్సవ విగ్రహ ప్రతిష్ఠాపన

ధర్మారం: మండలంలోని రామయ్యపల్లిలో శుక్రవారం సీతారామ, లక్ష్మణ్ హన్మాన్ ఉత్సవ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. సహకార సంఘాల ఫోరం జిల్లా చైర్మన్ ముత్యాల బలరాం రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్ఎస్ నాయకులు మిట్ట తిరుపతి, మూల మల్లేశం, బాలయ్య, కొమ్ము మహేశ్, మార్క ప్రవీణ్, శ్రీనివాస్, సతీశ్, స్వామి, వినోద్ పాల్గొన్నారు.

• ఎస్సారెస్పీ కాలువలో గుర్తు తెలియని శవం లభ్యం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రంగాపూర్ శివారులోని ఎస్సారెస్పీ కాలువలో శుక్రవారం గుర్తు తెలియని పురుషుడి (45) మృతదేహాన్ని కనుగొన్నట్లు బసంత్‌నగర్ ఎస్సై స్వామి తెలిపారు. పూర్తిగా కుళ్లిపోయిన మృతదేహం కాలువలో కొట్టుకుని వస్తుండగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని వెలికితీశామని, ఎవరైనా ఆచూకీ తెలిస్తే సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

• స్వాతంత్ర్య సమరయోధుడి కన్నుమూత

ఎలిగేడు: మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు తానిపర్తి కాంతారావు(99) శుక్రవారం కన్నుమూశారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విద్యార్థి దశ నుంచే ఆయన స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారని స్థానికులు గుర్తుచేసుకున్నారు. సుల్తాన్‌పూర్ సర్పంచ్‌గా 1964- 1987 వరకు సేవలు అందించారు. స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంఘం జిల్లా అధ్యక్షుడు బాలుసాని వెంకటేశం, ప్రధాన కార్యదర్శి కోల వెంకటేశ్వర్లు, కోశాధికారి వెంగలదాసు శ్రీనివాస్ సంతాపం తెలిపారు. కాంతారావు అంత్యక్రియలు శనివారం జరగనున్నాయి.

• విద్యార్థులకు బహుమతులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం వెంకట్రావుపల్లి జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు నిర్వహించిన అభ్యసనం ప్రాజెక్ట్ కార్యక్రమంలో ప్రతిభ కనబరిచారు. పాఠశాల హెచ్‌ఎం కొమురయ్య అభ్యసనంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శుక్రవారం బహుమతులు అందజేశారు.

• చేతిరాతపై విద్యార్థులకు శిక్షణ

కాల్వశ్రీరాంపూర్: మండలం ఊశన్నపల్లె ప్రభుత్వ పాఠశాలలో శనివారం చేతిరాతపై ప్రభుత్వ ఉపాధ్యాయుడు దిడ్డి సతీశ్ విద్యార్థులకు శిక్షణ ఇచ్చాడు. తెలుగు, ఇంగ్లీషు అక్షరాలు రాయడంలో మెలకువలు నేర్పించారు. అక్షరాలు అందంగా, చక్కగా రాసిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. హెచ్‌ఎం ఈర్ల సమ్మయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్షేత్ర పర్యటనలో ప్రభుత్వ విద్యార్థులు


నీటి శుద్ధి ప్లాంట్ సందర్శనలో విద్యార్థులు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పొట్యాల జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులను శుక్రవారం క్షేత్ర పర్యటనలో భాగంగా ముర్మూర్‌లోని నీటి శుద్ధి ప్లాంట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నీటిని శుద్ధి చేసే దశలు, ఎరినేషన్, క్లోరినేషన్, క్లీనింగ్ ప్రాసీజర్, పంపింగ్ విధానం, పీహెచ్‌వాల్యూ, నీటిలో సహజంగా ఉండే లవణాలు వాటి ఆవశ్యకతపై సంబంధిత ఇంజనీర్ అవగాహన కల్పించారు. బహిరంగ మార్కెట్‌లో లభ్యమయ్యే మినరల్ వాటర్ బాటిల్స్‌లో ఎలాంటి మినరల్స్ ఉండవని, మిషన్ భగీరథలో పంపిణీ చేసే నీటిలో సరిపడా లవణాలు ఉంటాయని వివరించారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, టీచర్లు తిరుపతి, శంకర్ ఉన్నారు.

సింగరేణి వార్తలు

కార్మిక కుటుంబాలకు ఇబ్బందులు లేకుండా చూడాలి


సమస్యలు తెలుసుకుంటున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: సింగరేణి కార్మిక కుటుంబాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ అన్నారు. ఏరియాలోని మిలీనియం క్వార్టర్లలో శుక్రవారం పాదయాత్ర ద్వారా పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా క్వార్టర్లలో ఉంటున్న కార్మిక కుటుంబాలతో మాట్లాడారు. క్వార్టర్లలో శానిటేషన్, తాగునీటి సరఫరా, సివిల్ వర్క్స్, ఎలక్ట్రికల్‌కు సంబంధించి ఎదుర్కొంటున్న ఇబ్బందులు తెలుసుకున్నారు. తాగునీటి సరఫరా, శానిటరీ సమస్యలు, విద్యుత్ సరఫరాలో అంతరాయం తదితర సమస్యలపై ఆరా తీశారు. కార్మికుల సంక్షేమం కోసం యాజమాన్యం రాజీలేకుండా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. జీఎం వెంట ఏఐటీయూసీ నాయకులు కె.స్వామి, మడ్డి ఎల్లయ్య, ఆరెల్లి పోశం, రంగు శ్రీనివాస్, ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్, డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబు, ఏరియా ఇంజనీర్ దాసరి వెంకటేశ్వర్‌రావు, వర్క్‌షాప్ డీజీఎం జితేందర్‌సింగ్, సివిల్ డీజీఎం వరప్రసాద్, ఎన్విరాన్‌మెంట్ అధికారి ఆంజనేయప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్పత్తి, రవాణాలో అగ్రగామిగా నిలపాలి


మాట్లాడుతున్న జీఎం సుధాకర్‌రావు

గోదావరిఖని: వార్షిక లక్ష్యాల సాధనతో పాటు బొగ్గు రవాణాలో ఓసీపీ–1ను సంస్థలోనే అగ్రగామిగా నిలపాలని ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. ఓసీపీ–1 సీహెచ్‌పీ, బేస్ వర్క్‌షాప్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. సమష్టి కృషితోనే నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించామన్నారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో కూడా ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా బొగ్గురవాణా చేయడంలో సీహెచ్‌పీ ఉద్యోగులు కీలక పాత్ర పోషించారని కొనియాడారు. యంత్రాల పనిగంటలు మరింత పెంచాలని ఆదేశించారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎం.రామచంద్రారెడ్డి, కోట రవీందర్‌రెడ్డి, డీజీఎం కాశీవిశ్వేశ్వరరావు, అధికారులు జీవీసత్యనారాయణ, నజీర్ అహ్మద్, పిట్ సెక్రటరీలు జి.శ్రీనివాస్, కిషన్‌నాయక్, పూర్ణాకర్, జె.దామోదర్‌రావు, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కార్మిక కుటుంబాలకు కలుషిత నీటి సరఫరా

గోదావరిఖని: కార్మిక కుటుంబాలకు కలుషిత నీటిని సరఫరా చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని, కార్మిక కుటుంబాలకు స్వచ్ఛమైన మంచినీరు అందించాలని సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. గోదావరి నది నుంచి కార్మిక కాలనీలకు కలుషితమైన నీరు సరఫరా చేస్తున్నారని తమ యూనియన్ మూడేళ్లుగా పోరాటం చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పొల్యూషన్ బోర్డు అధికారులు గోదావరినదిలో నీరు కలుషితమైందని, తాగేందుకు కాదు గదా స్నానం చేసేందుకు కూడా ఉపయోగపడవని నివేదికలు ఇచ్చారని గుర్తు చేశారు. అయినప్పటికీ ఆర్జీ–1 ఏరియా అధికారులు సరిగా పట్టించుకోవడం లేదన్నారు. కలుషిత నీటితో హెపటైటిస్ ఏ అనే వ్యాధి ఆరుగురికి సోకిందని గత నెల 28న నివేదిక ఇచ్చారని పేర్కొన్నారు. సింగరేణి ఏరియా హాస్పిటల్ ఏసీఎంవో గోదావరి నీటితో హెపటైటిస్ ఏ అనే వ్యాధి ఆరుగురికి సోకిందని, వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని అన్ని ఏరియాల అధికారులకు లేఖలు పంపి అలర్ట్ చేశారన్నారు. అయినప్పటికీ స్పందించక పోవడం శోచనీయమన్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి మిషన్ భగీరథ నీటిని సరఫరా చేసి కార్మికులు, కార్మిక కుటుంబసభ్యుల ఆరోగ్యం కాపాడే బాధ్యత యజమాన్యం, ప్రజా ప్రతినిధులపై ఉందన్నారు.

మహనీయులను గౌరవించిన చరిత్ర కాంగ్రెస్‌దే


మంథని: నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంథని: మహనీయుల త్యాగాలను గుర్తించి వారిని గౌరవించిన పార్టీ కాంగ్రెస్ అని ఆ పార్టీ మండలాధ్యక్షుడు ఐలి ప్రసాద్, యూత్ అధ్యక్షుడు సాదుల శ్రీకాంత్ అన్నారు. మంథని మండలం గుంజపడుగు, ఉప్పట్ల, పోతారం గ్రామాల్లో శుక్రవారం జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. మంథని సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పెంద్రు రమ, నాయకులు ఊదరి శంకర్, మూల సరోజన, ఎరుకల ప్రవీణ్, బూడిద శంకర్, మంథని సత్యం, ఆకుల కిరణ్ ఉన్నారు.

ముస్త్యాలలో కాంగ్రెస్ యాత్ర

యైటింక్లయిన్‌కాలనీ: కాంగ్రెస్ చేపట్టిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ లో భాగంగా శుక్రవారం రామగిరి మండలం ముస్త్యాలలో కాంగ్రెస్ జిల్లా మహిళా వైస్ ప్రెసిడెంట్ లావణ్య నాయకులతో కలిసి గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించి పాదయాత్ర చేపట్టారు. ఇంటింటా తిరుగుతూ రాజ్యాంగ ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. నాయకులు మహేశ్వరరావు, కృష్ణ, యాదగిరి, విజేందర్, నాగరాజు పాల్గొన్నారు.

ముత్తారం మండలంలో..

ముత్తారం: మండలంలోని ఖమ్మంపల్లి, జిల్లాలపల్లి, ఇప్పలపల్లి (రామకృష్ణాపూర్) గ్రామాల్లో శుక్రవారం జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, మండల మహిళా అధ్యక్షురాలు గోవిందుల పద్మ, నాయకులు మద్దెల రాజయ్య, గాదం శ్రీనివాస్, బియ్యని శివకుమార్ పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని న్యాయవాది నూతి సురేశ్ కుమార్‌పై 2న దుండగులు దాడి చేయడాన్ని నిరసిస్తూ గోదావరిఖని బార్ అసోసియేషన్, అడ్‌హక్ కమిటీ పిలుపు మేరకు శుక్రవారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. దుండగులను కఠినంగా శిక్షించాలని నిరసన తెలిపారు. విధుల బహిష్కరణతో గోదావరిఖని అదనపు జిల్లా, సీనియర్ సివిల్ జడ్జి, మున్సిఫ్ కోర్టుల్లో విధులు స్తంభించాయి. సభ్యులు జాగిరి రాజయ్య, పింగిళి విశ్వేశ్వరరావు, గంట నారాయణ, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

లింగాపూర్‌లో వైద్యశిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

రామగుండం: సింగరేణి ప్రభావిత గ్రామమైన లింగాపూర్‌లో శుక్రవారం సింగరేణి వైద్యులతో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సాధారణ జబ్బులు, మధుమేహం, బీపీ తదితర అంశాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేశారు. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కారం పద్మ, ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్, ఎన్విరాన్‌మెంట్ అధికారి ఆంజనేయప్రసాద్, మల్లికార్జున్ యాదవ్, వివిధ విభాగాలకు చెందిన వైద్యులు పాల్గొన్నారు.

హెచ్‌ఆర్‌డీ జీఎంకు సన్మానం


సన్మానిస్తున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: సింగరేణి సంస్థ హెచ్‌ఆర్‌డీ జీఎం బాధ్యతలు చేపట్టి మొదటిసారిగా ఏరియాకు వచ్చిన జి.రఘుపతిని శుక్రవారం సన్మానించారు. జీఎం కార్యాలయంలోని చాంబర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ హెచ్‌ఆర్‌డీ జీఎంను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్, డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబు, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, డీజీఎం ఫైనాన్స్ ధనలక్ష్మీబాయి, జీవీటీసీ మేనేజర్ డినేల్‌కుమార్, శ్రావణ్‌కుమార్, దాసరి శ్రీనివాస్, వీరారెడ్డి పాల్గొన్నారు.